
# రెడ్‌లైట్ ఏరియా

సింహాద్రివాణి




శ్యాంసుందర్ వివాహం కాక ముందు నుంచే తన భావి జీవితం భార్యా సమేతంగా ఎంతో హాయిగా గడపాలని కలలు కనేవాడు.

ప్రతి విషయంలోనూ భార్యతో సఖ్యతగా సామరస్యంగా వుండాలని అనుకునేవాడు. తన మనోభావాలకు తగిన భార్య రావాలని కోరుకునేవాడు.

"పిచ్చి వెధవలు చిన్నచిన్న కారణాలకే భార్యతో గొడవ పడి జీవితాలను చేజేతులా నరకం చేసుకుంటున్నారు. జీవితం ఆనందించేందుకుగానీ, లేనిపోని అపోహలు సృష్టించుకుని అఘోరించేందుకు కాదు".

"నా భార్యనీ నన్నూ చూసి సుఖపడటం చేతకాని సన్యాసులు కుళ్ళుకు చావాలి. అందరూ మా జంటని గురించే చెప్పుకోవాలి. మా అనుకూల దాంపత్యాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలి" యిలా సాగిపోతూ వుండేవి అతడి ఆలోచనలు.

తీరా అతడు ఎదురుచూసిన శుభఘడియ రానే వచ్చింది. ఆ అమ్మాయి అతడి అందానికి తగినజోడి. ..పేరు విరి ప్రేమ ఫలంకాదు పెద్దవాళ్ళు మాట్లాడిన సంబంధమే. అతడి అంతరాత్మ నీకు తగిన జోడీ, ఒప్పుకో ఒప్పుకోమని గొడవ పెడుతూంటే ఒప్పేసుకుని దాని నోరు మూయించాడు.

వివాహ మయింది. వాళ్ళ వైవాహిక జీవితం ఎంతో ఆనందంగా సాగిపోతోంది. ప్రశాంత సాగరంలో ఓడలా ఇద్దరూ ఉద్యోగస్తులు. చేతినిండా డబ్బు. దేనికీ కొదవ లేదు.

ఒకరంటే వొకరికి ప్రాణం. వారిజీవితం ఓ అనురాగ జలపాతం.

శ్యాంసుందర్ అప్పుడప్పుడూ తన మనోభావాలను భార్యతో పంచుకునేవాడు. భార్యాభర్తలంటే యిలా వుండాలనీ, అలా వుండాలనీ, ప్రతిదానికీ గొడవపడి మొఖం మాడ్చుకోకూడదనీ ఎడమొఖం, పెడమొఖంతో ఏడ్పుని కొని తెచ్చుకో కూడదనీ, అప్పుడే జీవనసంద్రంలో ఆనంద తరంగాలు ఉవ్వెత్తుగా లేస్తాయని భార్యతో చెప్తూ వుండేవాడు.

ఇలా కొన్ని నెలలు గడిచాయి. అన్ని విధాలా విరి తనకు అనుకూలవతియైన భార్యేనని నిర్ణయించుకున్నాడు.

ఉన్నట్టుండి విరి ఓ రోజున ఓ బాంబు పేల్చింది. ఆ పేలిన బాంబు దెబ్బకి కంగారు పడ్డాడు. ఖంగు తిన్నాడు. తననుకున్న దేమిటి? విరి చెప్పేదేమిటి ? విరి చెప్పేది నిజమా! ఏమో ! ఎంత ధైర్యంగా కుండ బద్దలు కొట్టినట్లు చెప్పింది. క్షణంలో అతడి ముఖం పాలిపోయింది. ఆనందం ఆవిరై ఆ మొఖాన విచారమేఘాలు అలముకున్నాయి. తన మనోభావాలు పైకి కనిపించకుండా వుండాలని ప్రయత్నిస్తున్నాడు.

కానీ సాధ్యం కావట్లేదు. చాలామంది మగ వాళ్ళలా తను ప్రవర్తించకూడదనీ, చీటికీమాటికీ భార్యతో తగాదా పడకూడదనీ, ఒకవేళ ఆమెవైపు నుంచి ఏదైనా తగాదా వచ్చినా, సమస్య వచ్చినా ఎంతో సామరస్యంగా, ప్రశాంతంగా పరిష్కరించుకోవాలనీ తాను ఎంతగా అనుకున్నాడు!

కానీ ... కానీ ... ఏమిటీ పరిస్థితి ?

జారిపోయే గుండె ధైర్యాన్ని పారిపోనివ్వకుండా ప్రయత్నిస్తూ "విరీ ! ఏమిటి నువ్వనేది ? మళ్ళీ ఒక్కసారి చెప్పవూ ? అన్నాడు జీవంలేని కంఠస్వరం జీరబోతూండగా.

"ఎన్ని సార్లు చెప్పినా ఒక్కటే మాట" ముందొకమాట చెప్పి, మాటమార్చే స్వభావంకాదు నాది."

పెళ్ళికాక పూర్వం నా గురించి మీకు ఎంతెంతో గొప్పగా చెప్పి వుండవచ్చు. వాళ్ళు చెప్పినదాన్ని బట్టి మీరు నావైపు మొగ్గు చూపి నావరకు వచ్చి వుండవచ్చు. వాళ్ళు చెప్పినదానికీ, యిప్పటి నాస్వభావానికీ, నేను చెప్పినదానికీ మీకు పొంతన కుదరకపోతే బాధ్యత నాది కాదు.

నా గురించి మీరే నిర్ణయం తీసుకున్నా నాకిష్టమే. మన వివాహమైన యీ స్వల్ప కాలంలోనే మీరు నన్ను అనల్పంగా ప్రేమిస్తున్నారు. ఆ ప్రేమని మోసం చెయ్యలేక మీ ముందు యదార్థాన్ని పరిచాను. వాస్తవాన్ని దాచి మోసం చెయ్యడం నాకిష్టం వుండదు. అందుకే నిజం చెప్పేశాను. నేనప్పుడప్పుడూ రెడ్‌లైట్ ఏరియాకు వెళ్తుంటాను." ఆమె అంత దృఢంగా చెప్తూంటే తట్టుకోలేక పోతున్నాడు. శ్యాసుందర్.

"అంటే రెడ్‌లైట్ ఏరియా ప్రక్క నుంచి వెళ్తావా?" ఏదో కొంత ఆశ మిణుక్కు మిణుక్కు మంటూండగా అడి గాడు మెల్లగా.

లేదండీ, ఆ ప్రదేశం లోపలికి వెళ్తాను. అక్కడకొంత టైం వుంటాను కూడా. ఇప్పటికీ వెళ్తూనే వున్నాను.

"అంటే .. అంటే ... నువ్వు... దేనికి డబ్బులు రోగం... నీకు... నాకు ...? శ్యాంసుందర్ ఏం మాట్లాడుతున్నాడో అతడికే అర్థం కావటం లేదు. మనిషి పూర్తిగా వివశుడయ్యాడు. అతడిలో నిద్రలేచిన అవివేకం వివేకానికి గొంతునొక్కింది. అతడి మానసికపరిస్థితి అయోమయానికి లోనయింది.

ఏ దిక్కు ఎటువుందో తెలియట్లేదు. తనకేమిటి దిక్కని ఆలోచిస్తున్నాడు. ఆ పరిస్థితిలో అతడికి పట్టపగలే చుక్కలు కన్పించి "వెక్కిరిస్తున్నాయి. నిజమా ! విరీ నీవు చెప్పింది నిజమా! నిజమా! నమ్మలేక పోతున్నాను." అనుకుంటున్నాడు పదే పదే.

అతడి మనోభావాలను కనిపెట్ట లేనంత పిచ్చిదేం కాదు విరి.

"అవును. నేను నిజమే చెప్పాను. వెళ్తున్నాను కాబట్టే చెప్పాను. ఆదర్శాలు వుంటే సరిపోదు. ఆచరించి చూపే ఔన్నత్యం కావాలి. ఏదైనా తనవరకు వస్తేగాని తెలియదు. ముక్కున్నాక పడిశం తప్పదు. సంసారమన్నాక గొడవలూ తప్పవు.

"తగాదాలు పడే భార్యాభర్త లందరూ వెధవలనుకుంటే ఎలా ? అపోహలూ, అపార్థాలు కాపురాలలో రావటం సహజమే! కానీ తెగే దాకా లాగకూడదు. సర్దుకుపోవాలి." అని అనుకుంటోంది విరి.

"విరీ, నా మీద ఒట్టేసి చెప్పు. నిజమా! నువ్వు వెళ్ళేది

'ఎన్నిసార్లు చెప్పాలి! ఒట్టేసినంత మాత్రాన నిజం అబద్ధం,అబద్ధం నిజమూ కావు. నమ్మకానికి ఒట్టు ప్రమాణంకాదు. నమ్మకం అంతే.

"విరీ! నువ్వంటే నా కిష్టం అన్నావు. పెళ్ళి కాకముందు నుంచీ నా భార్యతో నేను గొడవపడను. సర్దుకుపోతానని చెప్పేవాడి నన్నావు. నా భార్య రెడ్‌లైట్ ఏరియాకి వెళ్తున్నానని చెప్పినా కూడా తగాదా పడకుండా, సర్దుకుపోయి ఆమెతో కాపురం చేస్తున్నానని యిప్పుడు ఏ మొఖంపెట్టుకొని యెవ్వడితో చెప్తావో చెప్పు తగాదా పడే భార్యాభర్తలందరూ నీ దృష్టిలో వెధవలన్నావు. ఇప్పుడు నన్ను ఏం చేస్తావో చేసుకో నీ యిష్టం. అన్నట్లుంది ఆమె సమాధానం.

అతనిలో ఆవేశ కావేశాలు పెల్లుబుకుతున్నాయి. అహం అదుపు తప్పి విజృంభిస్తోంది. కానీ అతడిలోని సహజలక్షణం శాంత స్వభావం. తగాదా పడటం అతడికి నిజంగానే యిష్ట ముండదు. తాత్కాలిక కోపాన్ని సహజ శాంతం తొక్కిపట్టింది. నోరు విప్పకుండ పీకని నొక్కిపట్టింది.

ఇద్దరి మధ్యా మౌనం రాజ్యమేలుతోంది. స్నానం కూడా చెయ్యబుద్ధి కాలేదతడికి. బట్టలు మార్చుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

ఆఫీసుకి వెళ్ళాడేగాని, అంతా చిరాకు పరాకు సీటులో కూర్చోలేక పోతున్నాడు. టీ త్రాగటం అలవాటులేని వాడు ఒక్కగంటలో నాలుగు టీలు త్రాగాడు. అందరితో సరదాగా కబుర్లు చెప్పే మనిషి ఎవ్వరు పలకరించినా ముభావంగా సమాధానం చెప్తున్నాడు.


అందరితో మంచిగా వుంటూ జోకు లేసి నవ్విస్తూ నవ్వుతూవుండే శ్యాంసుందర్‌కీవేళ ఏమైందో ఎవ్వరికీ అంతు చిక్కటల్లేదు. చూసి చూసి భోజనం సమయంలో అడిగింది రజిత ప్రొద్దుటి నుంచీ అదోలావున్నారు. లంచ్‌బాక్స్ కూడా తెచ్చుకోలేదు. కొత్త జంటకదా ! మీ ఆవిడపుట్టింటికి గానీ వెళ్ళిందా అని.

"లేదు. అన్నాడు ముక్తసరిగా"

"అంటే వెళ్ళలేదనా? ఆవిడయిక్కడ లేదనా ?" మళ్ళీ ప్రశ్నించింది రజిత.

"వెళ్ళలేదు" అన్నాడు. ఎలాగోలా ఆఫీసు పని అయ్యిందనిపించి రెండురోజుల సెలవు పెట్టి బయటపడ్డాడు.

ఇల్లు చేరాడే కానీ



యిద్దరి మధ్యా మాటలు లేవు. మామూలుగానే తన కార్యక్రమాలకు వెళ్ళివస్తోంది విరి. ఆ రెండు రోజులు ఎక్కడెక్కడికో వెళ్ళాడు. ఏ అర్థరాత్రికో యిల్లు చేరుకున్నాడు.

ఆ పరిస్థితుల్లో విరి ఆలోచించడం మొదలు పెట్టింది. "అనవసరపు విషయాన్ని చెప్పి అలజడిని సృష్టించలేదు కదా! బ్రహ్మకైనా పుట్టు రిమ్మతెగులని అతడెంత? మానవ మాత్రుడు. చిలికి చిలికి గాలివానయ్యిందని దారి తప్పుతున్నాడేమో గురుడు" ఈ వేళో రేపో ముగింపు చెప్పాలి తప్పదు." అనుకుంది.

అయినా ఆలోచించనవసరం లేదూ. ఆవేశం వచ్చినప్పుడు మంచీ చెడుల వివేచనా శక్తినీ, ఆలోచనా జ్ఞానాన్నీ కోల్పోయి ఎంత గొప్పవాడైనా మూర్ఖుడిగా మారతాడనేందుకు యింత కంటే నిదర్శనం ఏం కావాలి. ఇప్పటికీ వెళ్తూనే వున్నాను. అంటే ఆలోచించ నవసరం లేదూ. మౌనవ్రతం పాటించడమేనా ? పెళ్ళైన దగ్గర నుంచీ ఏ ఒక్కరాత్రీ నన్ను విడిచి అతడుండలేదే!

"అంటే ఆఫీస్‌కని చెప్పి ఎగ్గొట్టి వెళ్తున్నాననా? ఏది చెప్తే అదిగుడ్డిగా నమ్మేయడమేనా? ఎంత వరకు నన్నర్థం చేసుకున్నాడో! ఆదర్శాలను ఎంత వరకు పాటిస్తున్నాడోనని చిన్న టెస్ట్‌పెట్టాను. నేనేగెలిచాను. అనుకుంది.

పెట్టిన సెలవు పూర్తికావడంతో ఆఫీస్‌కి వెళ్ళాడు. పెట్టిన సెలవు ముగిసింది గానీ ఆలోచనలు ముగియలేదు. ఆఫీసు పనులు పూర్తి చేసుకుని యధా ప్రకారం యింటిదారి పట్టాడు పరిసరాలను గమనించకుండ అన్యమనస్కంగా వెళ్ళిపోతున్నాడు.

ఇంతలో ట్రాఫిక్ కంట్రోలర్ గట్టిగా విజిల్ వేసి హలోయంగ్ మాన్, ఆపు బండి అత్తగారిచ్చిన కొత్తబండా! మంచి జోరుమీద వెళ్తున్నావ్ ? రెడ్‌లైట్ పడినప్పుడు ఆ యేరియాలో ఆగివెళ్ళాలని కూడ మర్చిపోయావు. అంటూ గదమాయించాడు.

"ఏమిటీ, రెడ్‌లైట్ ఏరియానా? రెడ్‌లైట్ ఏరియా అంటే యిదా ! ఈ మాటేగదా మూడు రోజులనుంచీ నా మెదడును తొలి చేసింది. అమ్మదొంగా ! నాకంటె నీవే తెలివిగల దానవు."

ఈలోపు ట్రాఫిక్ కంట్రోలర్ మళ్ళీ విజిల్‌వేశాడు. రెడ్‌లైట్ పడినప్పుడు ఆగ మన్నానేగానీ, గ్రీన్‌లైట్ పడినప్పుడు కూడా వెళ్ళవేమయ్యా, నువ్వెక్కడ దొరికా వయ్యా నా ప్రాణానికి, అన్న గద్దింపుకు వులిక్కిపడి ముందుకు పోనిచ్చాడు బండి.

అతడు వెళ్ళేప్పటికే ఆఫీసునుంచి వచ్చి నీట్‌గా తయారయింది విరి. అసలే అంద గత్తేమో ప్రత్యేక అలంకరణతో మరీ మెరిసిపోతోంది. అతడిని యింకా బాధపెట్టడం యిష్టంలేక రహస్యం చెప్పెయ్యాలని నిర్ణయించుకుంది.

ఇంతలో శ్యాంసుందర్ లోపలికి వచ్చి "విరీ ఆ రెడ్‌లైట్ ఏరియాకు నేను కూడా వెళ్ళాను. తెలిసిపోయింది. రహస్యం. ఇవిగో మల్లెపూలు అంటూ ఆమె మీదికి గిరాటేసి స్నానం చేసేందుకు బాత్‌రూమ్ కెళ్ళాడు.

## ☺ హాస్య చినుకులు ☺

సుహాసినికి వాళ్ళబ్బాయి చెన్నై నుండి కరంటుతో పనిచేసే ఇస్త్రీ పెట్టె తెచ్చిచ్చాడు. ఇంట్లో బట్టలు ఇస్త్రీ చేసుకోవడానికి.

సుహాసిని : ఒరే వంశీ ! ఈ ఇస్త్రీ పెట్టె వైరు ఊరకే అడ్డు వస్తుందిరా తోముతుంటే. ఈసారి వైర్‌లెస్ బాక్సు తెచ్చివ్వరా!

వంశీ : అలాగేనమ్మా. మన చాకలి వాళ్ళ దగ్గర వుండేది అదే కదా ! తెచ్చిపెడతాలే ! ఒక బొగ్గులబాస్తా కూడా వేయిస్తే సరా అన్నాడు.

**- యద్దల లలిత**

☺ ☺ ☺

గుర్నాధాన్ని పరీక్ష చేసిన వైద్యనాదం "తప్పదు, మరో ఆపరేషన్ చెయ్యాల్సిందే !" అని సలహా యిచ్చాడు.

ఆ మాట వింటూనే "డాక్టర్ ! ఈ ఆపరేషన్‌లోనూ నారోగమేమిటో అర్థం కాకపోతే ఏం చెయ్యాలి?" అయోమయంగా అడిగాడు గుర్నాధం.

"భయపడకండి... శవ పరీక్షలో ఎలాగైనా కనిపెట్టేస్తా !" భుజం తడుతూ అభయమిచ్చాడు వైద్యనాదం.

☺ ☺ ☺

"మీ తాతగారికి సీరియస్‌గా వుందని విన్నాను... ప్రస్తుతం పరిస్థితి ఎలా వుంది?"

"ఇప్పుడే డాక్టర్ని పంపేసి, వకీలు ఇంటికి వెళ్తున్నాను...!"

☺ ☺ ☺

"అదేమిట్రా ! మీ బామ్మగారు కళ్ళజోడు పెట్టుకునే నిద్ర పోతున్నారు?" అడిగాడు వర్మ శర్మని.

"ఏం లేదురా ! ఈ మధ్య కలలన్నీ మసక మసకగా కనిపిస్తున్నా యట... అందుకని..."

☺ ☺ ☺

రెండు ఎలుకలు బాగా తాగేసి ఒక ఏనుగు ముందుకు వెళ్ళాయి.

"కమాన్ ! కుస్తీకొస్తావా మాతో ?" సవాల్ చేసిందో ఎలుక.

"పోనీలే గురూ!వాడొక్కడు, మనం ఇద్దరం!" జాలిపడింది రెండోది.

**- వై.కె.మూర్తి**

☺ ☺ ☺